మహా నిమజ్జనానికి సర్వం సిద్ధం



చెరువుల వద్ద నిమజ్జన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ గౌతమ్, అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి



నిమజ్జన ప్రాంతాల్లో పరిసరాలను పరిశుభ్రం చేస్తున్న పంచాయతీ సిబ్బంది

- 17 చెరువుల్లో ఇప్పటి వరకు 10,204 విగ్రహాల నిమజ్జనం
- చెరువుల వద్ద పర్యవేక్షణకు పురపాలక కమిషనర్లు, రెవెన్యూ అధికారులు
- ప్రతి చెరువు వద్ద 2 క్రేన్లు, ఇద్దరు గజ ఈతగాళ్లు
- 10 మంది సిబ్బందితో సహాయక చర్యలు
- భక్తులకు అన్ని వసతులను కల్పించాం
- 2 వేల మంది పోలీసులతో బందోబస్తు
- మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్

సాక్షి, సిటీబ్యూరో: మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలోని 17 చెరువు వద్ద గణేష్ మహా నిమజ్జన కార్యక్రమం వైభవంగా, ప్రశాంతంగా జరిగేలా అధికార యంత్రాంగం సర్వం సిద్ధమైంది. భక్తులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని వసతులను కల్పిస్తోంది. ఈ నెల 7న గణనాథులు కొలువుదీరగా మంగళవారం వినాయక నిమజ్జన కార్యక్రమం కనుల పండుగలా జరిగేలా పటిష్ట చర్యలను తీసుకున్నారు. 17 చెరువుల వద్ద గణేష్ నిమజ్జన కార్యక్రమం ఇప్పటి వరకు ప్రశాంతంగా కొనసాగుతుండటంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా 2 వేల మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

- ప్రతి చెరువు వద్ద రెండు క్రేన్లు ఏర్పాటు చేయటంతోపాటు ఇద్దరు గజ ఈత గాళ్లను అందుబాటులో ఉంచారు. చెరువుల వద్ద విద్యుత్ లైటింగ్, మంచినీటి వసతితోపాటు 10 మంది సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. పోలీసు పికెట్, మెడికల్ క్యాంపు, ఫైర్ ఇంజన్, విద్యుత్ సౌకర్యాలను కల్పించారు. భక్తులకు టాయ్‌లెట్లు వంటి కనీస వసతులను కల్పించారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని చెరువుల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేశారు. రాత్రి వేళల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు.
- వినాయక నిమజ్జనోత్సవంలో ఎలాంటి అవాఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా 17 చెరువుల వద్ద ప్రత్యేక అధికారులుగా మున్సిపల్ కమిషనర్లు, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్లు, ఆర్డీఓలు, తహసీల్దార్లకు జిల్లా కలెక్టర్ గౌతమ్ బాధ్యతలను అప్పగించారు. నిమజ్జన ప్రాంతాలలోని చెరువులను జిల్లా కలెక్టర్ గౌతమ్, అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డీఆర్ఓ, ఆర్డీఓలు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలోని 17 చెరువుల్లో జీహెచ్‌ఎంసీ పరిధిలో11 ఉండగా, మిగతా ఆరు చెరువులు పురపాలక సంఘాలు, జీపీల పరిధిలో ఉన్నాయి.

నిమజ్జన చెరువులివే...

జిల్లాలో వినాయక నిమజ్జన కార్యక్రమానికి గుర్తించి, అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన చెరువులు వివరాలు ఈ విధంగా ఉన్నాయి. మేడ్చల్ మండలంలో సుతారి చెరువు, పెద్ద చెరువు, బాచుపల్లిలో ప్రతాపగిరి ట్యాంకు, ఉప్పల్‌లో నల్లచెరువు, కుత్బుల్లాపూర్‌లో వెన్నెల గడ్డ చెరువు, పరికి చెరువు, కూకట్‌పల్లిలో ఐడీఎల్ ట్యాంకు, సూరారం చెరువు,లింగం చెరువు, బాలానగర్‌లో హస్మత్‌పేట్ బోవెన్ చెరువు, శామీర్‌పేట్ మండలంలో శామీర్‌పేట చెరువు, మల్కాజిగిరిలో సఫల్‌గూడ ట్యాంకు, అల్వాల్‌లో కొత్త చెరువు, ఘట్కేసర్‌లో ఏదులాబాద్ చెరువు, కాప్రాలో చర్లపల్లి చెరువు, కాప్రా చెరువు, కీసరలో రాంపల్లి చెరువులలో గణేష్ నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా జరిగేలా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంది. జిల్లా వ్యాప్తంగా మూడు ఫీట్ల నుంచి మొదలుకొని ఐదు ఫీట్ల వినాయక విగ్రహాలు దాదాపు 31,775 ప్రతిష్ఠించినట్లు అధికార యంత్రాంగం అంచనా వేస్తోంది. గణేష్ నిమజ్జన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం (ఏడోవ రోజు) వరకు నిర్దేశించిన చెరువుల్లో భక్తులు 10,204 వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. గతేడాది వినాయక ఉత్సవాల్లో భాగంగా 17 చెరువుల్లో 29,875 వినాయక విగ్రహాలను భక్తులు నిమజ్జనం చేశారు. ఇందులో ఐదు ఫిట్లకు పైన ఉన్న వినాయక విగ్రహాలు 7,879 ఉండగా, ఐదు ఫీట్ల కంటే తక్కువగా మిగతా వినాయక విగ్రహాలు ఉన్నట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

శాతవాహన నగర్ పార్కును అభివృద్ధి చేస్తాం



పార్కును పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ తదితరులు

కూకట్‌పల్లి: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని శాతవాహన నగర్‌లోని రాంకి పెరల్ వద్ద ఉన్న పార్కును అభివృద్ధి చేస్తామని డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. శుక్రవారం కాలనీ వాసులతో కలిసి పర్యటించారు. పార్కు అభివృద్ధికి తగిన సలహాలు ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పార్కు సుందరీకరణ కోసం రూ.70 లక్షల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. పార్కులో ఓపెన్‌జిమ్, ప్రహరీ మరమ్మతులు, వాకింగ్ ట్రాక్ వంటి సౌకర్యాలు ఏర్పాటు చేసి కాలనీ ప్రజలకు ఉపయోగపడేలా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు సమ్మారెడ్డి, అందే నరసింహ, యాదిరెడ్డి, విష్ణు, కృష్ణమూర్తి, వెంకటరామిరెడ్డి, వర్కు ఇన్‌స్పెక్టర్ రవికుమార్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరికి ఘన నివాళి



కేపీహెచ్‌బీ కాలనీలో ఏచూరికి నివాళులర్పిస్తున్న నాయకులు

కూకట్‌పల్లి: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి హైదర్‌నగర్ సీపీఎం శాఖ ఘన నివాళి అర్పించింది. శుక్రవారం హెచ్‌ఎంటీ హిల్స్ కమ్యూనిటీ హాల్‌లో సంతాప సభ నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ..సీతారాం ఏచూరి చిన్నతనం నుంచే ఉద్యమాల్లో భాగస్వాములయ్యారన్నారు. నాటి ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడిన ధీరుడని స్మరించుకున్నారు. ఏచూరి మరణం వామపక్ష ఉద్యమాలకే కాకుండా అణగారిన వర్గాలకు తీరని లోటు అని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు బీఎస్. సుదర్శన్, హైదర్ నగర్‌శాఖ కార్యదర్శి వి. శివప్రసాద్, సీపీఎం మండల కార్యదర్శి ఎం.శంకర్, సీనియర్ నాయకులు రాజారావు, లక్ష్మీనరసయ్య, ఎల్‌డీ ప్రసాద్, నాగేశ్వరరావు, ధర్మారావు, ప్రసాద్, కేఎస్‌ఆర్ మూర్తి, బాపిరాజు, సత్తయ్య, గంగాధర్ రావు, మల్లేశ్వర చారి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కేపీహెచ్‌బీ శాఖ ఆధ్వర్యంలో..



హెచ్‌ఎంటీ హిల్స్ కమ్యూనిటీ హాల్‌లో జరిగిన సంతాప సభలో పాల్గొన్న నాయకులు

కేపీహెచ్‌బీ శాఖ ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశ రాజకీయాల్లో గొప్ప నాయకుడిని కోల్పోయామని సీపీఎం మండల నాయకులు కృష్ణా నాయక్ అన్నారు. కమ్యూనిజం భావాలతో ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నుంచి రాజకీయ పయనం మొదలు పెట్టి దేశ రాజకీయాల్లో చెరగని ముద్ర వేసిన గొప్ప ఆర్థిక, సామాజిక తత్త్వ వేత్తగా ప్రజల్లో నిలిచిపోతారన్నారు. కార్యక్రమంలో ఆర్. చిరంజీవి, శివకుమార్, శ్రీను, బాలు, భాష, ఆర్.శ్రీను, జానకిరామ్, గోపాల్, రవికృష్ణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎడిటర్ ఇన్ చీఫ్‌గా హెచ్‌సీయూ ప్రొఫెసర్

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ అజైలియునియుమై 'అంత్యజా' ఇండియన్ జర్నల్ ఆఫ్ విమెన్ అండ్ సోషల్ చేంజ్‌కి ఎడిటర్ ఇన్ చీఫ్‌గా నియమితులయ్యారు.

మురుగు సమస్యకు పరిష్కారమేది?



రోడ్డుపై పారుతున్న మురుగు నీరు

జీడిమెట్ల: రోడ్డుపై మురుగునీరు పారకుండా శాశ్వత పరిష్కారం చూపాలని సుభాష్‌నగర్ ప్రజలు కోరుతున్నారు. సుభాష్‌నగర్ లాస్ట్ బస్టాప్ నుంచి పైపులైన్ రోడ్డు వెళ్లే రోడ్డులో ప్రతినిత్యం రోడ్డుపై మురుగునీరు పారుతుంది. దీంతో రోడ్డు పక్కల ఉన్న ఇళ్లల్లోకి తీవ్రమైన దుర్వాసన రావడంతో నివాసితులు ఇబ్బంది పడుతున్నారు. గతంలో వేసిన యూజీడీ పైపులైన్ సామర్థ్యం సరిపోకపోవడంతో తరచూ మురుగు నీరు మ్యాన్‌హోళ్ల నుంచి బయటకు పొంగుతుందని కాలనీ వాసులు తెలిపారు. ఇప్పటికైనా కుత్బుల్లాపూర్ సర్కిల్ అధికారులు మురుగునీటి సమస్యకు చెక్ పెట్టాలని కోరుతున్నారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి

వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి



కమిషన్ చైర్మన్ కోదండరెడ్డితో హరివర్ధన్‌రెడ్డి, యాదగిరి, కాంగ్రెస్ నాయకులు

ఓల్డ్ బోయిన్‌పల్లి: రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన ఓల్డ్ బోయిన్‌పల్లిలోని డీసీసీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, పీసీసీ కార్యదర్శి దండుగుల యాదగిరి, కాంగ్రెస్ నాయకులతో కలిసి రైతు రుణమాఫీ పై చర్చించారు. ఎమైనా ఇబ్బందులు ఉన్నాయా?, అర్హులైన వారు ఇంకా ఎవరైన ఉన్నారా? వంటి తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతులు ఎదుర్కొంటున్న భూ సంబంధిత సమస్యలను పరిష్కరిస్తున్నామని తెలిపారు. అదే విధంగా చెరువులు, కుంటల సంరక్షణకు ప్రభుత్వం పకడ్బందీగా చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రతిపక్ష నాయకులు హైడ్రాకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో అరుణ్‌రెడ్డి, కనకరాజు, మల్లేష్, దేవయ్య, మహేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో పోషణ మాసం



పోషణ మాసం కార్యక్రమంలో పాల్గొన్న సూపర్‌వైజర్ జ్యోతి, మహిళలు

మూసాపేట: మూసాపేట జనతా నగర్, వడ్డెర బస్తీలోని అంగన్‌వాడీ సెంటర్‌లో శుక్రవారం పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, పిల్లల తల్లులకు పోషణ గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి మాట్లాడుతూ.. గర్భిణులు సంపూర్ణ పోషకాలు గల ఆహారాన్ని తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు మంజుల, శోభ, కవిత, సంధ్య, శశికళ, పుష్ప, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

ఖాజాగూడలో కూల్చివేతలు



రాయదుర్గం: ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు చేసిన వాటిని శుక్రవారం కూల్చివేశారు. శేరిలింగంపల్లి రెవిన్యూ, జీహెచ్‌ఎంసీ అధికారుల పర్యవేక్షణలో ఖాజాగూడలోని సర్వేనెంబర్ 40 లోని ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు చేసినట్లు రెవిన్యూ, జీహెచ్‌ఎంసీ అధికారులు గుర్తించారు. దీంతో స్థలం చుట్టూ వేసిన రేకులను పూర్తిగా తొలగించారు. అంతేకాకుండా ఇతర శాశ్వత, తాత్కాలిక నిర్మాణాలను కూడా తొలగించారు.ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు చేస్తే కూల్చివేస్తామని రెవిన్యూ, జీహెచ్‌ఎంసీ అధికారులు స్పష్టం చేశారు. ప్రభుత్వ స్థలాల్లో ఎవరూ నిర్మాణాలు చేయరాదని, ఒకవేళ చేస్తే నిర్దాక్షిణ్యంగా కూల్చివేస్తామని హెచ్చరించారు.

గణనాథుడి సేవలో..



మూసాపేటలో మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ తదితరులు



శ్రీ వివేకానందనగర్ సంక్షేమ సంఘం వినాయకుడి పూజలో మేడ్చల్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు మహ్మద్ గౌసుద్దీన్



గాయత్రి నగర్ సంక్షేమ సంఘం వినాయకుడి వద్ద నృత్యం



మహిళలను గౌరవించండి, మహిళలకు రక్షణగా ఉండండి అంటూ వినాయక మండపం వద్ద స్ఫూర్తి నింపిన చిన్నారులు

కూకట్‌పల్లి జంట సర్కిళ్ల పరిధిలో గణనాథుడు వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా భక్తుల సేవలు అందుకుంటున్నాడు. పలు మండపాల్లో ఏర్పాటు చేసిన వివిధ ఆకారాలతో కూడిన వినాయక విగ్రహాలకు మండపాల నిర్వాహకులు, పలు పార్టీల నాయకులు ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక పూజలు చేస్తున్నారు. పలు మండపాల్లో అన్నదానం, సాంస్కృతిక కార్యక్రమాలు, చిన్నారుల కూచిపూడి నృత్యాలు వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. –కూకట్‌పల్లి



అంజయ్యనగర్‌లోని గణనాథుడి వద్ద..



ఆస్‌బెస్టాస్ కాలనీ వినాయకుడి పూజలో..



హైదర్‌నగర్ మిత్ర హిల్స్ కాలనీలో లడ్డూను దక్కించుకున్న భక్తులు



మోతీనగర్ కమ్యూనిటీ హాల్ వద్ద నోరా మ్యూజికల్ అకాడమీ కళాకారులు



మాధవి నగర్ వినాయక మండపం వద్ద విభిన్న వేషధారణలో చిన్నారులు



కట్టమైసమ్మ బస్తీలోని వినాయకుడి పూజలో కార్పొరేటర్ నర్సింహయాదవ్



వినాయక పూజలో పాల్గొన్న దొడ్ల రామకృష్ణ గౌడ్ తదితరులు

రేపటి నుంచి ట్రాఫిక్ ఆంక్షలు

సాక్షి, సిటీబ్యూరో: గణేష్ నిమజ్జనం నేపథ్యంలో సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో ఈనెల 15 నుంచి 17 వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉంటాయి. ఈ మేరకు వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంపిక చేసుకోవాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు. ట్రాఫిక్ ఆంక్షలు ఉండే ప్రాంతాలివే..

◆ ఐడీఎల్ చెరువు, కూకట్‌పల్లి

ఐడీఎల్ ప్రవేశ ద్వారం నుంచి రెయినోబో విస్టా వరకు గణేష్ నిమజ్జనం వాహనాలకు మినహా ఇతర వాటికి ప్రవేశం లేదు. మూసాపేట, వై జంక్షన్ నుంచి ఐడీఎల్ చెరువు వైపు వచ్చే సాధారణ వాహనాలు కూకట్‌పల్లి బస్టాప్, కేపీహెచ్‌బీ మెట్రో స్టేషన్, జేఎన్‌టీయూ వద్ద మళ్లించాలి. అలాగే ఖైత్లాపూర్ నుంచి ఐడీఎల్ వైపు వచ్చే వాహనాలు ఆంజనేయ నగర్, మూసేపేట వైపు మళ్లించాలి.

◆ ప్రగతినగర్ చెరువు, కేపీహెచ్‌బీ

శ్రీనివాస స్టీల్ నుంచి త్రీ మంకీస్ జంక్షన్ వైపు సాధారణ వాహనాలకు నిషేధం. గండిమైసమ్మ, ప్రగతినగర్ నుంచి జేఎన్‌టీయూ వైపు వచ్చే వాహనాలు నిజాంపేట, 191 సర్వే నెంబరు, కాలనీ రోడ్, నిజాంపేట రోడ్ మీదుగా జేఎన్‌టీయూకు చేరుకోవాలి. అలాగే జేఎన్‌టీయూ నుంచి ప్రగతి నగర్ కాలనీ వైపు వచ్చే వాహనాలు కోనసీమ హోటల్ రోడ్, కొలన్ రాఘవ రెడ్డి గార్డెన్, నిజాంపేట మీదుగా ప్రగతినగర్‌కు చేరుకోవాలి.

◆ గంగారం చెరువు, ఆర్సీపురం

పటాన్‌చెరు నుంచి వచ్చే భారీ వాహనాలు తారానగర్ మార్కెట్, గోపన్‌పల్లి మీదుగా బీహెచ్‌ఈఎల్ జంక్షన్ వైపు మళ్లించాలి.

◆ కట్టమైసమ్మ ట్యాంక్, జీడిమెట్ల

గండిమైసమ్మ క్రాస్ రోడ్ నుంచి బాలానగర్ వైపు వచ్చే భారీ వాహనాలు బహదూర్‌పల్లి జంక్షన్ వద్ద ఎడమ వైపు తీసుకొని దూలపల్లి జంక్షన్ నుంచి జేఈటీఎల్ మీదుగా బాలానగర్‌కు చేరుకోవాలి. అలాగే బాలానగర్ నుంచి గండిమైసమ్మకు వచ్చే వాహనాలు సూరారం జంక్షన్ వద్ద లెఫ్ట్ తీసుకొని బౌరంపేట జంక్షన్ మీదుగా గండిమైసమ్మకు చేరుకోవాలి.

◆ పతికుంట ట్యాంక్, రాజేంద్రనగర్

బుద్వేల్ ఎక్స్‌టెన్షన్ నుంచి హిమాయత్‌సాగర్ టోల్‌గేట్ వరకు సాధారణ వాహనాలకు ప్రవేశం లేదు. ఓఆర్ఆర్ ఎగ్జిట్‌–17 నుంచి ఆరాంఘర్, అత్తాపూర్ వైపు వచ్చే వాహనాలు వాలంతరీ వద్ద యూ టర్న్ తీసుకొని టీజీపీఏ సర్వీస్ రోడ్, లార్డ్స్ కాలేజ్, ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి, దర్గా ఖలీజా ఖాన్, కిస్మత్‌పూర్, బుద్వేల్ మీదుగా వెళ్లిపోవాలి. అలాగే శివరాంపల్లి పిల్లర్ నెంబరు–294, పీడీపీ జంక్షన్ వచ్చే వాహనాలు బుద్వేల్ మీదుగా కిస్మత్‌పూర్, దర్గా ఖలీజా ఖాన్, ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి, లార్డ్స్ కాలేజ్, టీజీపీఏ జంక్షన్ మీదుగా హిమాయత్‌సాగర్ టోల్‌గేట్ వైపు వెళ్లిపోవాలి. అలాగే గచ్చిబౌలి, పటాన్‌చెరు నుంచి ఆరాంఘర్, అత్తాపూర్ వైపు వచ్చే భారీ వాహనాలు ఎగ్జిట్ నెంబరు–17 (రాజేంద్రనగర్ టోల్) వద్ద కాకుండా ఓఆర్ఆర్ ఎగ్జిట్ నెంబర్ 16 (శంషాబాద్) వద్ద వాహనాలు తీసుకోవాలి.

ప్రత్యామ్నాయ రోడ్లలో ప్రయాణించాలి

గచ్చిబౌలి: సర్వీస్ రోడ్డు నిర్మాణ పనులు కొనసాగుతున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ రోడ్లలో ప్రయాణించాలని సైబరాబాద్ జాయింట్ కమిషనర్ సోయల్ డెవిస్ సూచించారు. జేఎన్‌టీయూ వైపు వెళ్లే సైబర్ టవర్ ఫ్లై ఓవర్ ఎండ్ నుంచి యశోద హాస్పిటల్ వరకు సర్వీస్ రోడ్డు నిర్మాణం జరుగుతుందన్నారు. సైబర్ టవర్, కొత్తగూడ, 100 ఫీట్ రోడ్డు నుంచి జేఎన్‌టీయూ, మూసాపేట్ వైపు వాహనదారులు ప్రత్యామ్నాయ రోడ్లలో వెళ్లాలన్నారు. జేఎన్‌టీయూ, మూసాపేట్‌కు వెళ్లే వాహనాలు పర్వత్‌నగర్ జంక్షన్ నుంచి కైత్లాపూర్ ఫ్లైఓవర్ మీదుగా వెళ్లాలన్నారు. ఐకియా, సైబర్ గేట్ వే,, సీఓడీ జంక్షన్ నుంచి వచ్చే వాహనాలు నేరుగా సైబర్ టవర్ ఫ్లై ఓవర్ మీదుగా వెళ్లవచ్చన్నారు. సైబర్‌టవర్ కింద వైపు నుంచి జేఎన్‌టీయూ వైపు వెళ్లాల్సిన వాహనాలు ఎన్ కన్వెన్షన్ మీదుగా, జైన్ ఎన్‌క్లేవ్ వద్ద కుడివైపు తిరిగి యశోద వెనక వైపు ఉన్న రోడ్డులో జేఎన్‌టీయూ ఆర్‌ఓబీ వైపు వెళ్లాలని సూచించారు. ప్రత్యామ్నాయ రహదారుల్లో ప్రయాణించి, ట్రాఫిక్ జాం కాకుండా సహకరించాలని వాహనదారులను కోరారు.

చికిత్స కోసం చిన్నారికి ఆర్థికసాయం



మోతీనగర్: ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం మానవ ధర్మమని వీర లింగేశ్వర సేన కురుమ సంఘం ప్రతినిధులు అన్నారు. బంజారాహిల్స్ శ్రీరామ్‌నగర్‌కు చెందిన గడ్డమీది నరేందర్, కీర్తి దంపతుల కుమారుడు బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతడి కుటుంబ ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోవడంతో తండ్రి గతంలో మృతి చెందాడు. తల్లి కుమారుడిని పోషించుకుంటూ జీవనం సాగిస్తుంది. చిన్నారి మిథున్ (4) బ్రెయిన్ ట్యూమర్ వ్యాధితో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకున్న కురుమ సంఘం ప్రతినిధులు ఆసుపత్రి వైద్యం కోసం రూ.1.66 లక్షలను సేకరించి శుక్రవారం చిన్నారి మిథున్ కుటుంబ సభ్యులకు అందజేశారు.

బీఆర్ఎస్ శ్రేణుల అరెస్ట్



పోలీసుల అదుపులో కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు

కూకట్‌పల్లి: శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ నివాసానికి ర్యాలీగా వెళ్లి సమావేశం నిర్వహిస్తామని బీఆర్ఎస్ నేతలు ప్రకటించారు. ఈ క్రమంలో శుక్రవారం పార్టీ విస్తృత స్థాయి సమావేశానికి నాయకులు, కార్యకర్తలతో బయలుదేరిన వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావును పోలీసులు అదుపులోకి తీసుకొని అల్లాపూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే గాంధీ ఏ పార్టీలో ఉన్నారో ప్రకటించాలని డిమాండ్ చేశారు. అరెస్టులు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, నాయకులు ఆంజనేయులు, సతీష్, కొండల్‌రావు, మాధవి, తార, విక్రమ్, జగన్, కిరణ్, మధు, ప్రవీణ్, రవి, హరీష్, నవీన్, చేతన్, సంతోష్, విష్ణు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.